క్లుప్తంగా

భారీ అన్నదానం

కడియం: దుళ్ల శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీగణపతి ఉత్సవ పందిరి వద్ద ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాతలు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ అన్నదానానికి భారీగా గ్రామస్తులు తరలివచ్చారు. మండల కేంద్రమైన కడియం భాస్కర్‌రామ్‌నగర్‌లో అన్నదానం నిర్వహించారు. గ్రామ పెద్దలు, నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు.

రత్నరాజు సేవలు అభినందనీయం



రత్నరాజు దంపతులను సత్కరిస్తున్న యూత్ సభ్యులు

కడియం: దైవ సేవకులు, దామిరెడ్డిపల్లి బైబిలు మిషను మహిమ మందిరం నిర్వాహకులు రెవరెండ్ డాక్టర్ దేవరపల్లి రత్నరాజు సేవలను అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ పాస్టర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం యూత్ సభ్యులచే రత్నరాజు దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. దేవుని సేవలో వేలాది మందికి స్ఫూర్తిదాయకంగా ఉండడంతో పాటు, ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ రత్నరాజు స్ఫూర్తినిస్తారన్నారు. కార్యక్రమంలో బొర్రా వివేక్, కొండేటి ప్రసాద్, వినోద్, సంధ్య, మాధురి, పుష్ప, సన్నిధి స్త్రీలు, సంఘస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఉపాధ్యాయుడి సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న గొల్లపల్లి సత్యనారాయణ

కడియం: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన కడియపుసావరం అంబేడ్కర్ నగర్‌కు చెందిన ముత్తాబత్తుల సూర్యనారాయణ, పావనిలకు వారి పిల్లలు చదువుతున్న కడియం హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదం విషయం తెలుసుకొని ఆ కుటుంబానికి రూ.6వేలు, బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులు ఆదివారం అందజేశారు. అలాగే పిల్లలకు చదువుకు తన వంతు తోడ్పాటు అందిస్తానని అన్నారు. స్కూల్ హెచ్ఎం ఎల్‌పీఎల్‌జీ విజయలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

రేపు సహస్ర చండీ హోమం

సీటీఆర్ఐ: గురు నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమృతానందం రోజున సహస్ర చండీ పారాయణ, హోమం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్నట్టు తోట సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజ్య గురూజీ అమృతానంద నాథ సరస్వతి 2015 అక్టోబర్ 10న అమ్మవారిలో ఐక్యమయ్యారన్నారు. అక్టోబర్ 10కి ముందు 9 రోజుల నుంచి గురు నవరాత్రులుగా నిర్వహించి, పదిన అమృతానందం రోజుగా నిర్వహిస్తున్నామన్నారు. లోక కల్యాణార్థం చండీ పారాయణ, హోమం నిర్వస్తున్నామన్నారు.

ముగిసిన ప్రాజెక్టుల తయారీ కార్యశాల

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో త్రీడీ ప్రింటింగ్, ఆర్డినో సోలార్ ఎనర్జీ ప్రాజెక్టుల తయారీ కార్యశాల ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంలో మాత్రమే కాకుండా ప్రయోగ పూర్వకంగా విషయాలని తెలుసుకునేందుకు ఈ కార్యశాల ఉపయోగపడుతుందన్నారు. ప్రోసోల్ సంస్థ సహకారంతో దీనిని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ కోమలలక్ష్మి, ప్రోసోల్ సంస్థ ప్రతినిధులు గంగాధర్, షేక్ కరీముల్లా, రియాజ్, శ్రీను పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జయకర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ఎస్‌కేవీటీ హైస్కూల్‌లో జిల్లా యూటీఎఫ్ శాఖ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి అరుణ కుమారి, జిల్లా అధ్యక్షుడు జయకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే జీతాలు, బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి అరుణ్ కుమారి, యూటీఎఫ్ జిల్లా కమిటీ నాయకులు శంకరుడు, విజయ గౌరీ, రాంబాబు, ఈవీఎస్ఎస్ఆర్. ప్రసాద్, రమేష్, తాతారావు, రమణ, రవి, శ్రీనివాస్, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహిణీ నీకు అభివందనం

- తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే వారిని గుర్తింపు
- నిబంధనలు పాటించిన వారికి గ్రీన్ కార్డు, లేకుంటే రెడ్ కార్డు
- ఉత్తమ మహిళలకు వాల్ ఆఫ్ ఫేమ్
- ప్రతి నెల 15వ తేదీన నిర్వహణ



ఉత్తమ మహిళలకు గ్రీన్ కార్డు అందజేస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్ (ఫైల్)



ఉత్తమ మహిళల ఫొటోలతో ఏర్పాటు చేసిన వాల్ ఆఫ్ ఫేమ్‌ను ఆవిష్కరించిన కమిషనర్ దినేష్‌కుమార్ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని స్వచ్ఛంగా, అందంగా తయారు చేసేందుకు నగర పాలక సంస్థ ప్రత్యేక ప్రణాళిక చేపట్టింది. ఇప్పటికే కార్యాచరణ అమలు చేస్తోంది. శాగ్రిగేషన్ విధానంలో గృహిణులు తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర వస్తువులను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించేలా ఏర్పాటు చేశారు. ఈ ఉత్తమ పద్ధతులు పాటించిన మహిళలను గుర్తించి 'గృహిణీ నీకు అభివందనం' అంటూ నగర పాలక సంస్థ వారిని అభినందించే కార్యక్రమం చేపట్టింది. ఇది ఐదు నెలల నుంచి జరుగుతోంది. నగరంలో 20 క్లస్టర్లు ఉండగా అందులో 13వ క్లస్టర్‌లోని 32, 33, 35 డివిజన్లలో ఈ విధానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ ప్రతి నెలా 15వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమ నిర్వహణకు నగర కమిషనర్ 20 మంది సభ్యులతో ప్రత్యేక బృందాన్ని నియమించింది.

ఉత్తమ గృహిణులను గుర్తించేలా

డివిజన్‌లోని గుర్తించిన ప్రాంతంలో 30 రోజుల పాటు మహిళలు తడిచెత్త, పొడి చెత్త, హానికరమైన వస్తువులు వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించి, నిబంధనలు పాటించే మహిళలకు పారిశుద్ధ్య వలంటీర్లు ప్రతి రోజూ మార్కులు వేసే విధానం నిర్వహించనున్నారు. 30 రోజుల్లో సుమారు 21 రోజుల పాటు నిబంధనల ప్రకారం చెత్తను అందించిన మహిళలను గుర్తించి ఉత్తమ మహిళగా గుర్తిస్తారు. ఇలా చేసిన మహిళలకు గృహిణి నీకు అభివందనం పేరుతో కార్యక్రమం చేపట్టనున్నారు. ఇలా గుర్తింపు పొందిన మహిళలకు గ్రీన్ కార్డు, నిబంధనలు పాటించని మహిళలకు రెడ్ కార్డు అందిస్తారు. ఇదే విధంగా రెండు సార్లు రెడ్ కార్డు పొందిన మహిళలకు నేషనల్ గ్రీన్ కోర్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ 2016 నిబంధనలతో నోటీసులు జారీ చేస్తారు. ఉత్తమ మహిళగా ఎంపికై గ్రీన్ కార్డు పొందిన మహిళలకు క్లాత్ బ్యాగ్, రెండు కేజీల సేంద్రియ ఎరువు, వాటర్ బౌల్, నగర పాలక సంస్థ మెంబర్ షిప్ అందజేస్తారు. దీనితో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళల ఫొటోలను వాల్ ఆఫ్ ఫేమ్ ఏర్పాటు చేయనున్నారు.

90 మందికి గ్రీన్ కార్డులు



నగరాన్ని స్వచ్ఛ నగరంగా తయారు చేసేందుకు మహిళలు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. గృహిణీ నీకు అభివందనం పేరుతో ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకూ 90 మందికి కమిషనర్ చేతుల మీదుగా గ్రీన్ కార్డులు అందజేశాం. 15 మందికి నోటీసులు జారీ చేసి రెడ్ కార్డులు ఇచ్చాం. చెత్తను వేరు చేయడంలో మహిళలకే అవకాశం ఎక్కువ అందుకే వారిని అభినందించే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతి నెల 15న నిర్వహిస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియ.

–జొన్నలగడ్డ అన్నమయ్య, ఐఈసీ ఎక్స్‌పర్ట్ నగర పాలక సంస్థ

మహిళలతోనే సాధ్యం



నగరాన్ని స్వచ్ఛతతో ఆదర్శంగా నిలవాలంటే ప్రజల భాగస్వామ్యంతో సాధ్యమవుతుంది. నగరంలో ప్రతి మహిళా బాధ్యతగా తీసుకొని తడిచెత్త, పొడి చెత్త, హానికరమైన వ్యర్థాలను వేరు చేసి అందించినప్పుడే స్వచ్ఛత సాధ్యమవుతుంది. ఇలా అందరూ ముందుకు రావాలి. అప్పుడే స్వచ్ఛ నగరాన్ని సాధించగలం.

– దినేష్‌కుమార్, కమిషనర్ నగర పాలక సంస్థ

కారుణ్యానంద స్వామికి ఘన నివాళి



కారుణ్యానంద స్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొండబాబు తదితరులు

సీటీఆర్ఐ: అభాగ్యులకు, అనాథలకు సేవ చేయడమే కారుణ్యానంద స్వామి వారికి ఘనమైన నివాళి అని శ్రీగౌతమి జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు అన్నారు. ఆదివారం స్థానిక గౌతమీ జీవకారుణ్య సంఘం ఆశ్రమ ప్రాంగణంలో సంఘ వ్యవస్థాపకుడు కీర్తిశేషులు కారుణ్యానంద స్వామి 26వ వర్ధంతి కార్యక్రమం చైర్మన్ బర్రే కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన దాతలతో కలిసి స్వామి వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరు సాధువుల పాదాలను శుభ్రపరచి అన్నప్రసాదాలు, దుప్పట్లు సమర్పించారు. తన కష్టాన్ని, దాతల సహకారాన్ని లెప్రసీ వ్యాధి బాధితులకు, అనాథల ఆశ్రయానికి ఉపయోగించిన మహానుభావుడు కారుణ్యానంద స్వామి అని కొనియాడారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు, బాలలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవదాయ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లు బోర్డు డైరెక్టర్లు పిల్లి నాగేంద్ర ప్రసాద్, నాగులాపల్లి దేవి, లక్షణ రావు, చల్లంగి ఏడుకొండలు, చిట్టాబత్తుల అనంత లక్ష్మీ రాజు, తమ్మిశెట్టి రాధిక, ప్రభాస్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా



ప్రజలు సమస్యలు తెలుసుకుంటున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని జనచైతన్యనగర్ కాలనీ వాసుల సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆదివారం ఆయన హుకుంపేట జనచైతన్యనగర్ కాలనీలో సందర్శించి అక్కడ ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు, రోడ్లు నిర్మాణం చేపట్టాలని కాలని వాసులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. చందన మాట్లాడుతూ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని, డంపింగ్ యార్డు చుట్టూ రేకులను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి జి.వెంకటరావును ఆదేశించారు. మాజీ రాష్ట్రశెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ పాలిక శ్రీను, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, పెయ్యలరాజేష్, పసలపూడి శ్రీనివాస్, జనచైతన్యనగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమాజ సేవలో మేటిగా ఉండాలి



సత్య చారిటబుల్ ట్రస్టును ప్రారంభిస్తున్న చింతా ప్రసాద్‌రెడ్డి

కంబాలచెరువు: సమాజ సేవే ధ్యేయంగా, వాటిలో అందరికన్నా మేటిగా ఉండాలని హీరో షోరూమ్ అధినేత చింతా ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలో ఉన్న ప్రియదర్శిని చెవిటి, మూగ పిల్లల ఆశ్రమంలో నూతనంగా సత్య చారిటబుల్ ట్రస్టు ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు టి.రవి ఆశ్రమంలోని పిల్లలకు అల్పాహారాన్ని అందించారు. అనంతరం సత్య చారిటబుల్ ట్రస్ట్ అందించే సేవలను వివరించారు. ట్రస్టు నూతన కార్యవర్గాన్ని సభకు పరిచయం చేశారు. ట్రస్టు మార్గ నిర్దేశులుగా మార్ని వాసుదేవ్, చింతా ప్రసాద్‌రెడ్డి, కె.కేధారీశ్వరరావు, ఎం.సూర్యనారాయణ, టి.రవి, గౌరవ సలహాదారులుగా ఎం.మురళీ, బీఎస్ఎన్.మూర్తి, కె.రాజ్యలక్ష్మి, పీఎస్.గంగాధర్, టి.గణేష్, డాక్టర్ కె.ప్రసూనాంబ, టి.శ్రీనివాస్, కె.సుబ్రహ్మణ్యం వ్యవహరిస్తుండగా, మరో 10 మంది కార్యవర్గ సభ్యులు పనిచేయనున్నారు. ట్రస్టు కార్యకలాపాలపై టి.రవి పలు అంశాలను సభలో వివరించారు. కార్యక్రమంలో ప్రియదర్శిని ఆశ్రమం నిర్వాహకులు కె.స్వప్నవర్మ, మాజీ కార్పొరేటర్ కురగంటి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

శాటిలైట్ సిటీ విద్యార్థులకు ఇస్రో ఆహ్వానం

- ప్రాజెక్టు ప్రదర్శనకు కితాబు
- బహుమతులు అందుకున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న శాటిలైట్ సిటీ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఇస్రో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న శాటిలైట్ సిటీ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి ఇస్రో శాస్త్ర వేత్తల మన్ననలు పొందారు. సైన్స్ ప్రాజెక్ట్ పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్–3 ప్రాజెక్ట్ బహుమతి పొందింది. ఇస్రో జనరల్ మేనేజర్ సైంటిస్ట్ విజయ్ కుమార్ విద్యార్థులను పరీక్షించి, వారి ప్రాజెక్టులను విశ్లేషించి తగిన సూచనలు సలహాలు అందజేశారు. ప్రాజెక్టు రూపకల్పనలో విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ సునీల్ కుమార్ విద్యార్థులను అభినందించి మెమెంటో సర్టిఫికెట్ అందజేశారు. ఈ విద్యార్థులు ఇస్రోను ఎప్పుడైనా సందర్శించవచ్చని వారికి అవకాశం కలిపిస్తున్నామని చెప్పారు. ఇది అపూర్వ అవకాశం అని విద్యార్థులు వేణు మాధవి, షైనీ ,అవినాష్, గోపి, గైడ్ టీచర్ సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రోత్సహించిన సర్వేశ్వరరావు, రాజారావు, ఉపాధ్యాయిని మేకా సుసత్య రేఖ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.రాజరాజేశ్వరిని అభినందించారు. శాటిలైట్ సిటీ హైస్కూల్ విద్యార్థులను, జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈరంకి నారాయణ, రూరల్ ఎంఈవోలు అయ్యంకి దుర్గా తులసీదాస్, చందుకుమార్‌లు అభినందించారు.

యువతలో ప్రతిభను వెలికి తీయాలి



విద్యార్థులను అభినందిస్తున్న సుబ్బారావు

రాజమహేంద్రవరం సిటీ: యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి నిరంతరం కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షులు తోట సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం వై.జంక్షన్ ఆనం రోటరీ హాల్ లో యువజన ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో 130 పాఠశాల, కళాశాలలకు చెందిన 505 మంది విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి, వారికి పురస్కారాలు అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు విజేతలకు బహుమతులు అందజేశారు. ఏటా సెప్టెంబర్‌లో పది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభా పురస్కారాలు అందచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పట్టపగలు వెంకట్రావు, క్లబ్ కార్యదర్శి నూనె సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై సమావేశం ఏర్పాటు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: కృష్ణా జలాలపై ప్రతిపక్షాలు, రైతు నేతలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ కోరారు. నగరంలో ఆదివారం జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తున్న వారిపై నిర్బంధ కాండ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ చేసే ప్రతి పోరాటానికీ సీపీఐ మద్దతు ఉంటుందని చెప్పారు.

గుర్తుకొస్తున్నాయి..



నాటి ఉపాధ్యాయులతో పూర్వపు విద్యార్థులు

ధవళేశ్వరం: ఒకే చెట్టు నీడలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఓ చోటకు చేరి సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని, రోజంతా ఆనందంగా గడిపారు. 27ఏళ్ల క్రితం రోజులను గుర్తుచేసుకున్నారు. ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలుర ఉన్న పాఠశాలలో 1995–96లో విద్యాభ్యాసం సాగించిన పదో తరగతి విద్యార్థులందరూ అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. రంకిరెడ్డి శ్రీనివాస్, కురసాల ఉమామహేశ్వరరావు, శివారెడ్డి తదితరులు నెల రోజులుగా శ్రమంచి మొత్తం 110 మంది పూర్వ విద్యార్థులను ఒక చోటకు చేర్చారు. అలనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి, పాదాభివందనం చేశారు. గురువులు సోమయాజులు, కమలాదేవి, మేకా సత్యనారాయణ, సంపద లక్ష్మి, సత్యవతి, రామలక్ష్మి, సుబ్బలక్ష్మి, నీలకంఠరావు, డేవిడ్‌రాజు, షా బాబాలను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడి చేసి భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్నారు. విద్యార్థి నిధి ద్వారా సేకరించిన ఒక లక్ష రూపాయల మొత్తాన్ని గతంలో మరణించిన పూర్వ విద్యార్థి కుటుంబానికి ఇచ్చేందుకు నిర్ణయించారు.

ఆనందంగా ఉంది



27 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి సహచరులు రావడం మధురానుభూతిని మిగిల్చింది. ఈ జ్ఞాపకం కలకాలం నిలిచి ఉంటుంది.

–కురసాల ఉమామహేశ్వరరావు

శ్రమకు ప్రతిఫలం



కష్టపడితే సాధించలేనిది ఏదీ ఉండదు. ఇంత మంది ఒక చోట కలుసుకుంటామా అని అందరం సందేహించాం. కష్టపడితే పోయేదేముందని అని ముందుకు సాగాం. శ్రమకు ప్రతిఫలం దక్కింది. ఇప్పుడు ఇంతమంది కలిసి గురువులను సత్కరించుకోవడం ఎనలేని ఆనందాన్నిచ్చింది.

– రంకిరెడ్డి శ్రీనివాస్

నేటి నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌లో సోమవారం నుంచి 13వ తేదీ వరకూ జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటిండెంట్ పి.కోమల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 9న అన్ని తపాలా కార్యాలయాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, 10న సామాన్య ప్రజలను ఆర్థిక చేరికలో భాగస్వామ్యం చేయడానికి 'జనంలోకి మనం' అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు పొదుపు పథకాలు, తపాలా జీవిత బీమా పాలసీలు, ఐపీపీబీ సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు. 11న ఫిలాటలీ దినోత్సవంలో భాగంగా పాఠశాలల్లో డాయి అఖర్ ఉత్తరాల పోటీ, 12న తపాలా పార్సెల్ సేవల్లో వచ్చిన మార్పులపై అవగాహన కల్పిస్తామన్నారు. 13న వేమగిరి, కొంతమూరు, మునికొడవలి, కె.గంగవరం గ్రామాల్లో ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి ఇంటింటా ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ వామపక్షాలు ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు చీకట్ల వెంకటేశ్వరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రమణ ఆదివారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు.

వన్డే మ్యాచ్‌ను తిలకించిన ఎంపీ భరత్



క్రికెట్ మ్యాచ్ వీక్షిస్తున్న ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని పుష్కర్ ప్లాజాలో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్‌పై ఆస్ట్రేలియా వెర్సస్ ఇండియా క్రికెట్ మ్యాచ్‌ను నగర కమిషనర్ కె.దినేష్ కుమార్, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులతో కలిసి ఎంపీ మార్గాని భరత్‌రామ్ వీక్షించారు. ఆదివారం చెన్నైలోని చెపాక్ స్టేడియంలో వన్డే క్రికెట్ మ్యాచ్ ఎంతో ఉత్కంఠగా ఆరంభమైంది. రోహిత్ సేన ఆస్ట్రేలియా జట్టును ఢీకొంది. ఇటీవల ఎంపీ భరత్ సూచనలు, ఆదేశాలతో పుష్కర్ ప్లాజాను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇక్కడే బిగ్ స్క్రీన్‌పై వన్డే క్రికెట్ మ్యాచ్‌ను ఎంపీ భరత్ బహిరంగంగా కమిషనర్ దినేష్ కుమార్, నగర ప్రజలతో కలిసి వీక్షించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

సీటీఆర్ఐ: స్థానిక ఆహ్వానం ఫంక్షన్ హాల్‌లో బీవీఎస్ రాజమహేంద్రవరం మూడు శాఖలు సంయుక్తంగా జాతీయ బృందగాన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సంస్కృతం, హిందీ విభాగంలో 18 పాఠశాలలు, తెలుగు, జానపదం విభాగంలో 12 పాఠశాలలు పాల్గొన్నాయి. వీటిలో తొమ్మిది పాఠశాలలు ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో నిలిచియాయి. ఆదివారం జరిగిన కార్యక్రమంలో విజేతలకు భారత వికాస పరిషత్ గోదావరి శాఖ కార్యదర్శి బి.రత్నాంబ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాయికృష్ణ, జయప్రద, పీవీ కృష్ణారావు, ఆర్‌కే జైన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



బ్యారేజ్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ రోడ్డు గుంతల మయంగా మారిందని ఆదివారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ధవళేశ్వరంలో నిరసన చేపట్టారు. వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేయించాలని యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందుకూరి మనోజ్‌బాబు డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా నిరసన కార్యక్రమం చేపట్టిన నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ కన్వీనర్ ఆకుల శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల వెంకటలక్ష్మి, అర్బన్ కన్వీనర్ యనమల రంగబాబు పాల్గొన్నారు.

దారి కాచి డబ్బులు దోచుకున్న దుండగులు!

కడియం: వేమగిరి వద్ద రాత్రి 2 గంటల సమయంలో మోటారుసైకిల్‌పై వస్తున్న ఇద్దరు యువకులను అటకాయించి, వారి వద్ద నున్న రూ.4,500 నగదు దోచుకున్న ఘటన చోటు చేసుకుంది. కడియం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లికి చెందిన నాగాబుత్తుల దుర్గాప్రసాద్, స్నేహితుడు హేమసాయితో కలిసి ఈనెల 7వ తేదీన వైజాగ్‌లో పరీక్ష రాసేందుకు వెళ్లారు. 8న తెల్లవారుజామున 2 గంటల సమయంలో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వద్ద ఉంచిన తమ మోటారుసైకిల్‌పై తిరిగి ఇంటికి బయలుదేరారు. వీరిద్దరూ వేమగిరి చేరుకునే సరికి బైక్‌పై ఎదురుగా వచ్చిన ఇద్దరు వ్యక్తులు వీరిని అటకాయించారు. నగదు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. దీంతో భయపడి ఇద్దరి వద్ద ఉన్న రూ.4,500 నగదును ఇచ్చేశారు. ఆ డబ్బులు తీసుకుని దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు కడియం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీస్‌లు అప్రమత్తమై సమీపంలో సీసీ కేమేరాలను పరిశీలించారు. వివరాలు సేకరించారు.